www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 18 అక్టోబర్ 2025 | 5 | ఏలూరు

ఎన్‌ఆర్‌ఐ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు పిహెచ్‌డి పట్టా



పట్టా స్వీకరిస్తున్న సురేష్

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

పోతవరప్పాడు ఎన్ ఆర్ఐ కళాశాలలో బేసిక్ సైన్సెస్ అండ్ హ్యూమానిటీస్ విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ తాళ్లూరి వెంకట సాయి సురేష్‌కు గీతమ్ (డీమ్డ్ టు బి) యూనివర్సిటీ విశాఖపట్నం వారిచే పిహెచ్‌డి ప్రదానం చేశారు. పిహెచ్‌డి పట్టాను శుక్రవారం కళాశాల ఛైర్మన్ ఆర్.వెంకట్రావు సురేష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.నాగభూషణ్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ జి.సాంబశివరావు, బేసిక్ సైన్సెస్ అండ్ హ్యుమానిటీస్ విభాగాధిపతి టి.హరిత, అడ్మిన్ డైరెక్టర్ డి.శైలారావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది సురేష్‌ను అభినందించారు.

ధాన్యం కొనుగోళ్లలో.. రాజకీయం..!

- ఆర్‌ఎస్‌కెల్లో సిబ్బంది నియామకమంతా రాజకీయ నేతల కనుసన్నల్లోనే
- అర్హతతో సంబంధం లేకుండా నేతల అనుయాయులకే పీఠం
- ప్రతి రైతుసేవా కేంద్రంలోనూ ముగ్గురు సిబ్బందికి అవకాశం
- ధాన్యం కొనుగోలు రెండు నెలలు సొసైటీల నుంచి వీరికి జీతభత్యాలు
- ఏలూరు జిల్లాలో 240, పశ్చిమలో 265 ఆర్‌ఎస్‌కెల్లో సిబ్బంది నియామకాలు
- ఒత్తిళ్లతో తలలు పట్టుకుంటున్న వ్యవసాయాధికారులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ధాన్యం కొనుగోలు ప్రక్రియను సైతం రాజకీయ నాయకులు తమ గుప్పెట్లో పెట్టుకుంటున్న పరిస్థితి కన్పిస్తోంది. ఆర్‌ఎస్‌కెల్లో (రైతుసేవా కేంద్రాలు) తాత్కాలిక సిబ్బంది నియామకం సైతం అధికార పార్టీ నేతల కనుసన్నల్లో సాగుతోంది. అర్హతతో సంబంధం లేకుండా రాజకీయ నేతలు సూచించిన వారినే ఆర్‌ఎస్‌కెల్లో నియమిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సామర్థ్యం లేని నేతల అనుయాయులతో పని చేయించుకోవడం వ్యవసాయాధికారులకు సవాల్‌గా మారనుంది. వరిసాగులో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలకు రాష్ట్రంలో ప్రత్యేక స్థానం ఉంది. అత్యధిక వరి సాగు ఈ రెండు జిల్లాల్లోనే సాగుతోంది. ప్రస్తుత ఖరీఫ్‌లో పశ్చిమలో 2.05 లక్షల ఎకరాల్లో వరిసాగు సాగగా, ఏలూరు జిల్లాలో దాదాపు రెండు లక్షల ఎకరాల్లో వరిసాగు ఉంది. రెండు జిల్లాల్లో మొత్తంగా 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని లెక్కలుగట్టి ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు సైతం జరుగుతున్నాయి. నవంబర్ మొదటి వారం నుంచి ధాన్యం కొనుగోలుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ధాన్యం కొనుగోలులో ప్రధాన పాత్ర పోషించే ఆర్‌ఎస్‌కెల్లో సిబ్బంది నియామకంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏలూరు జిల్లాలో 240 ఆర్‌ఎస్‌కెలు ఉండగా, పశ్చిమలో 265 వరకూ ఉన్నాయి. ధాన్యం కొనుగోలుకు సంబంధించిన మొత్తం ప్రక్రియ ఆర్‌ఎస్‌కెల ద్వారానే సాగుతోంది. ధాన్యం కొనుగోలు ప్రక్రియ సవ్యంగా సాగేందుకు ఆర్‌ఎస్‌కెలో ఉండే అగ్రికల్చర్ అసిస్టెంట్‌కు సహాయం చేసేందుకు ప్రతియేటా తాత్కాలిక సిబ్బంది నియామకం జరుగుతోంది. తేమశాతం వంటివి పరిశీలించేందుకు టెక్నికల్ అసిస్టెంట్, ఆన్‌లైన్ ప్రక్రియ చేసేందుకు డేటా ఎంట్రీ ఆపరేటర్, ఒకరు లేక ఇద్దరు సహాయకులను మొత్తం ముగ్గురు లేక నలుగురిని నియమిస్తారు. అర్హతల ఆధారంగానే పౌరసరఫరాలశాఖ ఈ నియామకాలు చేపట్టాల్సి ఉంది. అందుకు విరుద్ధంగా సిబ్బంది నియామకం జరుగుతుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నేతలు ఎవరి పేరు చెబితే వారికే పీఠం

ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఆర్‌ఎస్‌కెల్లో నియమించే వారంతా రాజకీయ నాయకుల అనుయాయులే కావడం గమనార్హం. అర్హతతో సంబంధం లేకుండా రాజకీయ నేతలు ఎవరి పేరు చెబితే వారినే నియమిస్తున్నట్లు తెలుస్తోంది. ధాన్యం కొనుగోలు జరిగే రెండు నెలలు సిబ్బందికి జీతభత్యాలు సహకార సంఘాల నుంచే చెల్లిస్తారు. దీంతో రాజకీయ నాయకులు చెప్పినవారిని నియమించుకుంటూ జీతభత్యాలు కట్టబెడుతున్న పరిస్థితి కన్పిస్తోంది. ఆర్‌ఎస్‌కెల్లో సిబ్బంది నియామకం ఇప్పటికే పశ్చిమ గోదావరి జిల్లాలో పూర్తయినట్లు చెబుతుండగా, ఏలూరులో ఇంకా ప్రక్రియ పూర్తికావాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. ఆర్‌ఎస్‌కెల్లో సిబ్బంది నియామకానికి సంబంధించి నిబంధనలను పౌరసరఫరాలశాఖ అధికారులు సైతం బయటపెట్టని పరిస్థితి ఉంది. ఆర్‌ఎస్‌కెల్లో సిబ్బంది నియామకాలకు సంబంధించి నిబంధనలు ఏమిటో, ఏవిధంగా నియమిస్తున్నారో ఏఒక్కరికీ తెలియని పరిస్థితి ఉంది. రాజకీయ నేతల అనుయాయులను నియమించడంతో ధాన్యం కొనుగోలులో వ్యవసాయాధికారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది. ధాన్యం కొనుగోలులో నేతలు ఎవరికి చెబితే వారికే ప్రాధాన్యత ఇస్తూ ఆర్‌ఎస్‌కెల్లో నియమించిన సిబ్బంది ముందుకు సాగే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు. ఆర్‌ఎస్‌కెల్లో నియమించుకున్న సిబ్బందికి శిక్షణ సైతం సక్రమంగా ఇవ్వడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఆ కారణంగానే ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు తలెత్తుతున్నట్లు తెలుస్తోంది. సిబ్బంది నియామకంపై ఉన్న నిబంధనలు ఏమిటో ఇప్పటికైనా అధికారుల బయటపెట్టాలని రైతులు కోరుతున్నారు.

చిన్నపాటి జాగ్రత్తలే పండుగ

- చిన్నపాటి జాగ్రతలతో ఆనంద దీపావళి
- 240 బాణసంచా దుకాణాలకు అనుమతి
- అనధికార అమ్మకాలు జరగకుండా నిరంతర పర్యవేక్షణ
- విపత్తు స్పందన, అగ్నిమాపక జిల్లా అధికారి టి.శ్రీనివాస్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

దీపావళికి బాణసంచా కాల్చే విషయంలో పిల్లలు, పెద్దలు అందరూ తగిన జాగ్రత్తలు తీసుకుని ప్రమాదాల బారిన పడకుండా పండుగను సంతోషంగా జరుపుకోవాలని విపత్తు స్పందన, అగ్నిమాపక జిల్లా అధికారి టి.శ్రీనివాస్ సూచించారు. జిల్లాలో ఎన్ని బాణసంచా దుకాణాలకు అనుమతులు ఇచ్చారు, ఎలాంటి నిబంధనలు విధించారు, అనధికార దుకాణాలు ఏమైనా గుర్తించారా వంటి ప్రశ్నలకు ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన సమాధానాలు ఇచ్చారు.

ప్రశ్న: జిల్లాలో దీపావళి పండుగ సందర్భంగా ఎన్ని బాణసంచా దుకాణాలకు అనుమతులు ఇచ్చారు?

అధికారి: జిల్లాలో ఇప్పటి వరకు 240 బాణసంచా దుకాణాలకు అనుమతి ఇచ్చాం. ఏలూరులో 71, భీమడోలులో 35, కైకలూరులో 32, నూజివీడులో 28, జంగారెడ్డిగూడెంలో 51, చింతలపూడిలో 23 దుకాణాలకు రెవెన్యూ, పోలీస్, ఫైర్, మున్సిపల్ అధికారులతో కూడిన జాయింట్ యాక్షన్ కమిటీ అనుమతులు ఇచ్చింది. ఇవికాక ఎనిమిది పర్మినెంట్ దుకాణాలు అంటే సంవత్సరం అంతా అమ్మకాలు సాగించే దుకాణాలు ఉన్నాయి. వారు మార్చిలోనే రెన్యువల్ చేసుకున్నారు.

ప్రశ్న: జిల్లాలో బాణసంచా తయారీ కేంద్రాలు ఏమైనా ఉన్నాయా?

అధికారి: జిల్లాలో బాణసంచా తయారీ కేంద్రాలు లేవు. స్టోరేజీ పాయింట్లు ఉన్నాయి. నూజివీడు, భీమడోలు, చింతలపూడిల్లో ఏడు స్టోరేజీ పాయింట్లు ఉన్నాయి.

ప్రశ్న: ఇటీవల ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో భారీ ప్రమాదం జరిగిన నేపథ్యంలో ఇక్కడ ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు?

అధికారి: ఇప్పటికే స్టోరేజీ కేంద్రాలను రెండు, మూడుసార్లు పరిశీలించి తగిన ఆదేశాలు జారీ చేశాం. దీపావళి సందర్భంగా ఏర్పాటు చేసే దుకాణాలకు ఇప్పటికే నిబంధనలు సూచించాం. దుకాణానికి దుకాణానికి మధ్య మూడు మీటర్లు దూరం ఉండాలని, ప్రతి దుకాణం వద్ద 200 లీటర్ల డ్రమ్ము ఏర్పాటు చేసుకుని నీరు నింపి ఉంచాలని సూచించాం. అంతేకాక రెండు ఇసుక బకెట్లు, రెండు నీటి బకెట్లు ఏర్పాటు చేయాలని సూచించాం. అవికాక అగ్నిమాపక పరికరాలు కూడా అక్కడక్కడా ఏర్పాటు చేస్తాం. అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ఒక ఫైర్ ఇంజన్ ఏలూరులోని ఇండోర్ స్టేడియం మైదానంలో ఏర్పాటు చేస్తున్న దుకాణాల వద్ద ఉంచి నిరంతరం సిబ్బంది పర్యవేక్షిస్తారు. ఎలాంటి ప్రమాదం జరిగినా ఎదుర్కోవటానికి సిద్ధంగా ఉంటాం.

ప్రశ్న: జిల్లాలో అనధికార దుకాణాలు, స్టోరేజీ పాయింట్లు, తయారీ కేంద్రాలు ఏమైనా గుర్తించారా?

అధికారి: ప్రస్తుతానికి అనధికారికంగా ఎక్కడా, ఎలాంటి అమ్మకాలూ జరగడం లేదు. తయారు చేయటం, నిల్వ ఉంచడం కూడా లేదు. మండలస్థాయిలోనూ ఒక ఎస్ఐ, తహశీల్దార్, స్టేషన్ ఫైరాఫీసర్లతో నిరంతర పర్యవేక్షణ. ఎక్కడైనా అనధికార అమ్మకాలు జరిగితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: ప్రస్తుతం జిల్లాలో ఎన్ని ఫైర్ స్టేషన్లు ఉన్నాయి, ఎన్ని ఫైర్ ఇంజన్లు ఉన్నాయి, సిబ్బంది కొరత ఏమైనా ఉందా?

అధికారి: ప్రస్తుతం జిల్లాలో ఆరు ఫైర్ స్టేషన్లు ఉండగా, ఏడు ఫైరింజన్లు ఉన్నాయి. ఏలూరులో రెండు ఫైరింజన్లు ఉండగా మిగిలిన చోట్ల ఒక్కొక్కటి ఉన్నాయి.

ప్రశ్న: కొత్తగా ఫైర్ స్టేషన్లు జిల్లాలో ఏర్పాటు చేసే అవకాశం ఏమైనా ఉందా?

అధికారి: ప్రస్తుతానికి అలాంటిదేమీ లేదు. కొయ్యలగూడెంలో ఫైర్ స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాం. మంజూరు కాలేదు. సరిపడా సిబ్బంది ఉన్నారు. ఎలాంటి కొరతా లేదు.

ప్రశ్న: దివాలి దీపావళి సందర్భంగా ప్రజలకు మీరిచ్చే సూచన ఏమిటి?

అధికారి: దీపావళి పండుగను ప్రమాదాల బారిన పడకుండా పిల్లలు, పెద్దలు అందరూ సంతోషంగా జరుపుకోవాలి. ప్రతి సంవత్సరం దీపావళి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో బాణసంచా కాల్చే సమయంలో చిన్న చిన్న జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ప్రమాదాలను నివారించొచ్చు. బాణసంచా కాల్చేటప్పుడు కాటన్ దుస్తులు మాత్రమే ధరించాలి. కళ్లకు కళ్లజోడు ధరించడం మంచిది. భారీ పేలుళ్లు జరిగే బాంబులకు దూరంగా ఉండటం మంచిది. ముఖ్యంగా రాకెట్లు వంటివి కాల్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. తగినంత నీరు, మందంగా ఉన్న దుప్పటి దగ్గర ఉంచుకోవాలి. అలాగే ఫస్ట్ ఎయిడ్ కిట్ కూడా దగ్గర ఉంచుకోవాలి. ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే మంటలు ఆర్పి, ప్రథమ చికిత్స చేసి ఆసుపత్రికి తీసుకెళ్లాలి. ముఖ్యంగా పిల్లలకు కళ్ల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకుని వారి భవిష్యత్తు అంధకారం కాకుండా చూసుకోవాలి. ఇలా చిన్నపాటి జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా పండుగను ఆనందంగా జరుపుకోవచ్చు.

మహిళలు అద్భుతాలు సృష్టిస్తారు

బాలికలు అవకాశాలు అందిపుచ్చుకోవాలి

కలెక్టర్ వెట్రిసెల్వి, జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ

ప్రజాశక్తి - ఏలూరు

మహిళలకు అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సృష్టిస్తారని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ అన్నారు. స్థానిక గవరవరం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథులు వెట్రిసెల్వి, పద్మశ్రీ పాల్గొన్నారు. జ్యోతిప్రజ్వలన చేసి కలెక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా జిల్లాలో వివిధ పాఠశాలల్లో వివిధ రకాల పోటీల్లో గెలుపొందిన 14 మంది బాలికలకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు కలెక్టర్, జెడ్‌పి ఛైర్‌పర్సన్ చేతుల మీదుగా అందజేసి సత్కరించారు. బాలిక లావూరి హిమబిందు మాట్లాడుతూ తన తల్లిదండ్రులు ఆక్వా చెరువుల్లో పని చేయడం వల్ల చదువు మధ్యలో మానేశానని, అంగన్వాడీ టీచర్ల ప్రోత్సాహంతో తాను మళ్లీ పదో తరగతిలో చేరానని తెలిపారు. తాను పోలీసు అధికారిగాని, డాక్టర్‌గాని కావాలని కోరుకుంటున్నానని వివరించింది. దీనిపై కలెక్టర్, జెడ్‌పి ఛైర్‌పర్సన్ హర్షం వ్యక్తం చేస్తూ ఆమెను ప్రత్యేకంగా సత్కరించారు. ఇటువంటి వారిని గుర్తిస్తే ఇదే రకంగా తిరిగి బడుల్లో చేర్పిస్తారని, ఇది ఎంతో స్ఫూర్తిదాయకమని చెప్పారు. మేము సైతం అనే ఫ్లెక్సీ బోర్డుపై కలెక్టర్ సంతకం చేశారు. మీ రక్షణ-మా కర్తవ్యం శక్తి యాప్‌ను ఆవిష్కరించి, ప్రతి మహిళ, ప్రతి బాలిక శక్తి యాప్‌ను డౌన్లోడ్ చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా వెట్రిసెల్వి మాట్లాడుతూ విద్య అనే ఆయుధంతో ప్రతి బాలిక ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం ఎందుకు జరుపుకుంటున్నామని కలెక్టర్ కొన్ని ప్రశ్నలు వేయగా, కొంతమంది బాలికలు చెప్పిన సమాధానంపై ఆమె సంతృప్తి వ్యక్తం చేవారు. ఇద్దరికి నగదు బహుమతులు అందజేశారు. భ్రూణ హత్యలు, వరకట్నాలు, ఆడపిల్లలంటే వివక్ష తగ్గినా ఇంకా కొనసాగుతున్నాయని, వాటిని మనమంతా ఐక్యంగా రూపుమాపాలని అన్నారు. కుటుంబ అభివృద్ధికి మహిళల పాత్ర కీలకమని, మహిళలకు అవకాశాలు కల్పిస్తే సమాజంలోని అన్ని రంగాల్లో ఘనవిజయాలు సాధిస్తారని అన్నారు. మహిళలు, బాలికలు స్వీయ రక్షణ నైపుణ్యాలు అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ మాట్లాడుతూ స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌ల వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ ఎం.అచ్యుత అంబరీష్, ఐసిడిఎస్ ఆర్‌జెడి బి.సుజాతారాణి, పీడీ ఎ.శారద, డిఎంహెచ్‌ఒ డాక్టర్ పిజె.అమృతం, డిఇఒ ఎం.వెంకటలక్ష్మమ్మ, జిల్లా శిశుసంరక్షణ అధికారి డాక్టర్ సిహెచ్.సూర్యచక్రవేణి, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, తహశీల్దారు గాయత్రీదేవి, నోడల్ అధికారి ఏలూరు తులసి, కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ మెర్సీ, సిడిపిఒలు, కళాశాల అధ్యాపకులు, ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

వర్క్ అవుట్ సోర్సింగ్‌ను వ్యతిరేకిస్తూ నేడు ధర్నా

ఏలూరు నగరంలో పలు సర్కిళ్లలో విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు నగరంలోని 11, 30వ డివిజన్లలో వర్క్ అవుట్ సోర్సింగ్ పేరుతో అమలు చేస్తున్న ప్రయివేటీకరణ విధానాన్ని ఆపాలని కోరుతూ ఈ నెల 18వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు మున్సిపల్ ఆఫీసు వద్ద జరిగే ధర్నాలో కార్మికులందరూ పాల్గొనాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి అంగులూరి జాన్‌బాబు పిలుపునిచ్చారు. శుక్రవారం సుంకరవారితోట, తూర్పువీధి, వంగాయగూడెం, పడమర వీధి సర్కిళ్లలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జాన్‌బాబు మాట్లాడుతూ పారిశుధ్య పనుల ప్రయివేటీకరణను నిలిపివేయాలని, ఆప్కాస్ ద్వారా నియామకాలు చేపట్టాలని, ఆప్కాస్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఏలూరు కార్పొరేషన్‌లో రిటైరైన, సర్వీసులో ఉండగా మృతి చెందిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని కోరారు. పెరుగుతున్న నగర జనాభాకు అనుగుణంగా మున్సిపల్ కార్మికుల నియామకాలు ఆప్కాస్ ద్వారా చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. పారిశుధ్యం సేవలు ప్రయివేటీకరిస్తే ప్రజల ఆరోగ్యాలు ప్రశ్నార్థకమవుతాయని, పారిశుధ్య వ్యవస్థ అస్తవ్యస్తమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వర్క్ అవుట్ సోర్సింగ్ విధానాన్ని వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో నెల్లూరు తరహాలో కార్మికులందరినీ సమీకరించి ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, నేతలు ఎం.ఇస్సాక్, జె.గోపి, పి.రవికుమార్, బండి రాజు పాల్గొన్నారు.

పుస్తకాలకున్న విలువ ఎప్పటికీ తగ్గదు

రిటైర్డ్ మున్సిపల్ ఆర్‌డి డాక్టర్ వి.రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

సోషల్ మీడియా, టెక్నాలజీ ఎంత అందుబాటులోకి వచ్చినా పుస్తకాలకు ఉన్న విలువ ఎప్పటికీ తగ్గదని రిటైర్డ్ మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ వి.రాజేంద్రప్రసాద్ అన్నారు. శుక్రవారం ఏలూరులోని అశోక్‌నగర్ ఫ్లైఓవర్ పక్కనేవున్న నగరపాలక సంస్థకు చెందిన 'నమస్తే పార్కు'లో జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్ ఏర్పాటుచేసిన 'బుక్ నూక్'(పుస్తకాలగూడు)లో ఉంచేందు కోసం మున్సిపల్ రిటైర్డ్ రీజినల్ డైరెక్టర్, అడ్వకేట్ డాక్టర్ వి.రాజేంద్రప్రసాద్, వెజ్లీనా దంపతులు రూ.7 వేలు విలువైన చరిత్ర, చట్టం, కవిత్వం, ఆధ్యాత్మికం, కార్టూన్లు, ఆరోగ్యం, సైన్స్, జీవిత చరిత్రలు, జనరల్ నాలెడ్జ్ మొదలైన అంశాలకు సంబంధించిన 50 పుస్తకాలు బహూకరించారు. తమ వద్ద వున్న పుస్తకాలు పదిమందికీ ఉపయోగపడాలనే ఉద్దేశ్యంతో వీరు ఆ పుస్తకాలను పార్కు 'బుక్ నూక్'లో ఉంచినట్లు తెలిపారు. వీటిని అవసరమైన వారు ఇక్కడే చదువుకోవచ్చు, లేదా ఇంటికి తీసుకెళ్లి చదువుకోవచ్చు అని తెలిపారు. అలాగే, ఇతరులు కూడా తమవద్ద వున్న పుస్తకాలను ఇటువంటి బుక్ నూక్స్‌లో ఉంచటం ద్వారా తాము తెలుసుకున్న విషయాలను పదిమందికీ పంచినట్టు అవుతుందని, అవకాశం ఉన్నవారంతా ఈ మంచి కార్యక్రమానికి తమవంతు సహకారం అందించాలని వారు విజ్ఞప్తి చేశారు.

సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఐ

జీలుగుమిల్లి : సైబర్ నేరగాళ్ల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని సబ్ ఇన్‌స్పెక్టర్ వి.క్రాంతి కుమార్ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం గిరిజన గురుకుల బాలుర జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాల నిరోధం, పోక్సో చట్టాలు, సైబర్ నేరాల వల్ల కలిగే అనార్థలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఇటీవల కాలంలో సోషల్ మీడియా ప్రభావం యువత మీద తీవ్ర ప్రభావం చూపుతుందని అన్నారు. ఆన్‌లైన్ షాపింగ్‌ల పేరు తో రకరకాల యాప్‌ల ద్వారా ఆఫర్స్‌ను పంపిస్తూ మాయచేసి డబ్బులు కాజేస్తున్నారని, వాటి పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖర్ శర్మ, అధ్యాపకులు సిహెచ్.రమేష్, ఐ.విద్యాసాగర్, ఐ.విఠల్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై జాగ్రత్తలు పాటించండి : ఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్

రోడ్డు ప్రమాదంలో చనిపోతే పోయేది ఒక ప్రాణం కాదని, ఒక కుటుంబం రోడ్డున పడుతుందని జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్ అన్నారు. ప్రపంచ ట్రామా దినోత్సవం సందర్భంగా ఆశ్రమ హాస్పిటల్ ఆధ్వర్యాన రోడ్ సేఫ్టీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్ హాజరయ్యారు. ఈ ర్యాలీను ఆశ్రం హాస్పిటల్ నుంచి ఫైర్ స్టేషన్, వట్లూరు, కలపర్రు టోల్ గేట్ మీదగా తిరిగి ఆశ్రం హాస్పిటల్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ మనం జాగ్రత్తగా నడిపినా మరొకరి నిర్లక్ష్య ధోరణి ప్రభావానికి కారణం కావచ్చని, నిర్దేశించిన ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ అందరూ క్షేమంగా గమ్య స్థానాలకు చేరాలని సూచించారు. హైవేను ఆనుకొని ఉన్న ఆశ్రమ హాస్పిటల్ ద్వారా రోడ్డు ప్రమాదం సమయంలో ఎమర్జెన్సీ అలెర్ట్ సిస్టంను, రాపిడ్ రామ రెస్పాన్స్ టీంను ఏర్పాటు చేసి క్షతగాత్రులను సరైన వైద్య చికిత్సలు అందజేయాలని కోరారు. ఆశ్రమ హాస్పిటల్స్ సిఇఒ డాక్టర్ కె.హనుమంతరావు మాట్లాడుతూ అవగాహన కల్పించడం తమ బాధ్యత అని, తప్పకుండా ఎస్‌పి సూచనల మేరకు రాపిడ్ రామ టీంను ఏర్పాటు చేస్తామని అన్నారు. గత 25 సంవత్సరాలుగా ఎంతో మంది క్షతగాత్రులకు అత్యుత్తమ వైద్య సేవలు అందజేయగలిగామని తెలిపారు. ఆశ్రమ హాస్పిటల్స్ సిబ్బంది గానీ, వారి రక్త సంబంధీకులు గానీ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వారిని గుర్తుచేసి జాగ్రత్తగా ఉండాలని పిలుపునిచ్చారు. ఆశ్రమ హాస్పిటల్స్ ఎమర్జెన్సీ డిపార్ట్మెంట్ విభాగాధిపతి డాక్టర్ ప్రణయ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ గ్రూప్ సిఒఒ రాజరాజన్, సూపరింటెండెంట్ శాంతయ్య, డిప్యూటీ సూపరింటెండెంట్ హరీష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హాజరైన ఆటో యూనియన్ సభ్యులకి సిఇఒ హనుమంతరావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

రైళ్లలో మహిళలకు భద్రత కల్పించాలి

ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.హైమావతి, ఎ.శ్యామల రాణి

ఏలూరు అర్బన్ : రైళ్లలో మహిళలకు భద్రత కల్పించాలని ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.హైమావతి, ఎ.శ్యామల రాణి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. విశాఖపట్నం నుండి హైదరాబాద్ వెళ్లే రైలులో మహిళల భోగిలో ప్రయాణిస్తున్న మహిళపై అగంతకుడు కత్తితో బెదిరించి అత్యాచారం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. మహిళల భోగిలోకి ప్రవేశించిన నిందితుడు ఆమె నగదు, ఆభరణాలు, సెల్‌ఫోన్ లాక్కుని, అత్యాచారం చేసి పారిపోయాడని, ఈ కాలంలో రైలులో మహిళలపై దాడులు పెరుగుతున్నాయని, ఆగివున్న రైళ్లను అడ్డాగా చేసుకొని పని ప్రదేశాలలో మహిళలపై దాడులకు పాల్పడుతున్న నేరాలు పెరిగాయని, అయినా రైల్వే అధికారులకు చీమకుట్టినట్లు కూడా లేకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఇప్పటికైనా రైళ్లలో పోలీసుల నిఘా పెంచాలని, ప్రతి భోగిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, హెల్ప్ లైన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే బాధిత మహిళలకు న్యాయం చేయాలని, నిందితున్ని వెంటనే అరెస్టు చేయాలని, మహిళా ప్రయాణికులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

వైసిపి ఆధ్వర్యాన కోటి సంతకాల సేకరణ

కుక్కునూరు : వైసిపి మండల అధ్యక్షులు తాండ్ర రాజేష్ ఆధ్వర్యాన రచ్చబండ, కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తాండ్ర రాజేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రయివేటుపరం చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, పేదలకు వైద్యం, విద్యా సేవలను అందకుండా చేసే కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. గత జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించగా, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేసి, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్, ఇంటింటికి వైద్య సేవలను నిలిపివేసిందని విమర్శించారు. వైద్య వ్యవస్థ పూర్తిగా కుంటుపడిన నేపథ్యంలో జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు కోటి సంతకాలు సేకరించి, గవర్నర్‌ను కలిసి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని, ప్రజలు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి గాడిద రామచంద్రం, సోషల్ మీడియా నియోజకవర్గ ఇన్‌ఛార్జి మల్లేలా చంటి నాయుడు పాల్గొన్నారు.

హబీబ్ భాషాకు జెడిగా ఉద్యోగోన్నతి

జెడిగా నియమించి జిల్లాలోనే పని చేసే అవకాశం!

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

వ్యవసాయశాఖ డిప్యూటీ డైరెక్టర్ (జిల్లా వ్యవసాయ శాఖాధికారి)గా పని చేస్తున్న షేక్ హబీబ్ భాషాకు వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్‌గా ప్రభుత్వం ఉద్యోగోన్నతి కల్పించింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల్లో నెల్లూరులో పోస్టింగ్ ఇస్తున్నట్లు పేర్కొన్నప్పటికీ జిల్లాలోనే జెడి బాధ్యతలు నిర్వహించే అవకాశం కల్పించింది. హబీబ్ భాషాకు జెడిగా ఉద్యోగోన్నతి లభించడంపై వ్యవసాయశాఖలోని అధికారులు, సిబ్బంది నుంచి అభినందనలు వెల్లువెత్తాయి. జెడిగా ఉద్యోగోన్నతి పొందిన తర్వాత బదిలీ చేసిన స్థానానికి వెళ్లాల్సి ఉంటుంది. కొంతకాలంగా జిల్లా వ్యవసాయాధికారిగా పని చేస్తున్న హబీబ్ భాషా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ రైతుల సమస్యలను పరిష్కరిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు ఆయన పనితీరుపై సంతృప్తిగా ఉన్నారు. ఖరీఫ్‌లో యూరియా కొరత తలెత్తినప్పుడు సమస్య తీవ్రతరం కాకుండా చర్యలు తీసుకుని రైతులకు ఇబ్బంది లేకుండా చేశారు. దీంతో ఆయనను జిల్లాలోనే జెడిగా బాధ్యతలు నిర్వహించేలా అవకాశం కల్పించినట్లు తెలుస్తోంది.

న్యాయమూర్తి గవాయ్‌పై దాడికి నిరసన

ప్రజాశక్తి - చింతలపూడి



వినతి అందిస్తున్న నేతలు

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్.గవాయిపై దాడి చేసిన వారిని వెంటనే శిక్షించాలని ఎంఆర్‌పిఎస్ నియోజకవర్గ అధ్యక్షులు ఎం.ముక్తేశ్వరరావు అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం నియోజకవర్గ కన్వీనర్ తాళ్లూరి రాజారావు అధ్యక్షతన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నేతలు చౌటపల్లి విజయ్ మాట్లాడగా డిప్యూటీ తహశీల్దార్ షకీలా బేగంకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నక్షత్రం, గంధం శ్రీను, మొనూరి సతీష్, పింగుల భాస్కరరావు, ఆదూరి రవికుమార్, వేల్పుల రవివర్మ, మొనూరి వంశీ పాల్గొన్నారు.

నూజివీడు టౌన్: సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్‌పై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎస్‌పి జిల్లా నాయకులు వేంపాటి వెంకటేశ్వరరావు మాట్లాడగా, విలియం, కంకటి వెంకటేశ్వరరావు, రమేష్, రుద్రయ్య పాల్గొన్నారు.

సామాజిక సమస్యల పరిష్కారానికి డిజిటల్ ప్లాట్‌ఫామ్

48 గంటల్లో సమస్య పరిష్కారం : సబ్ కలెక్టర్ బి.వినూత్న

నూజివీడు టౌన్ : నూజివీడు సబ్ డివిజన్ పరిధిలోని యువతీ యువకులకు తమ సృజనాత్మకత, డిజిటల్ నైపుణ్యాలు, సామాజిక బాధ్యతను ప్రదర్శించడానికి 'ఫ్రమ్ నూజివీడు వి లీడ్' అనే ప్రత్యేక డిజిటల్ ప్లాట్‌ఫాం ప్రారంభించడం జరిగిందని నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న చెప్పారు. ఈ ప్లాట్ ఫాం ద్వారా యువత ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సేవా చర్యలు, ప్రజా సమస్యలు, విజయాలను ప్రజలకు చేరవేయడానికి అవకాశం లభిస్తుందన్నారు. ఈ డిజిటల్ ప్లాట్‌ఫాం ద్వారా సోషల్ మీడియా కంటెంట్ క్రియేటర్స్, డిజిటల్ మీడియా, కంటెంట్ క్రియేషన్, సోషల్ మీడియా ప్లాట్‌ఫాం, వీడియో, ఫొటో డాక్యుమెంటేషన్‌ల ద్వారా, ప్రభుత్వంతో పాటు నూజివీడు అభివృద్ధిలో భాగస్వాములు అవ్వవచ్చన్నారు. ఈ ఫ్లాట్ ఫాం ద్వారా మంచి మంచి ఆలోచనలు సమాజానికి అందించాలన్నారు. ఆసక్తి కలిగిన సోషల్ మీడియా కంటెంట్ క్రియేటర్స్, యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ట్రాఫిక్ సమస్య జఠిలం

అత్యవసరానికి తప్పని పరిస్థితి

పరిష్కారం చూపాలని వాహనదారుల వేడుకోలు

ప్రజాశక్తి – నూజివీడు టౌన్

ట్రాఫిక్ మధ్యలో ఇరుక్కున్న అంబులెన్స్

నూజివీడు పట్టణ పరిధిలో రోజురోజుకీ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్య మరింత జఠిలంగా మారుతుంది. ప్రాణాపాయ స్థితిలోని పేషంట్లను ఆసుపత్రికి తరలించే అంబులెన్సులు సైతం దారి ఇవ్వని దుస్థితిలో నూజివీడు ట్రాఫిక్ తయారైంది. ఇరుకైన రోడ్లు, విచ్చలవిడిగా వాహనాల పార్కింగ్‌లు, కమర్షియల్ కాంప్లెక్స్‌ల వద్ద, ప్రధాన రహదారులపై వాహనాల పార్కింగ్ లేకపోవడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కమర్షియల్ కాంప్లెక్స్‌లో ఉన్న కొద్దిపాటి సెల్లార్లను సైతం ఇతర అవసరాలకు వినియోగించుకోవడం ట్రాఫిక్ సమస్యకు మరో ప్రధానమైన కారణంగా కనిపిస్తోంది. పట్టణంలో నెలకొన్న ట్రాఫిక్ సమస్యపై మున్సిపల్, పోలీస్, ఆర్‌అండ్‌బి, రెవెన్యూ, ట్రాఫిక్ పోలీస్ శాఖలకు చెందిన అధికారులు తగిన చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజానీకం ముక్తకంఠంతో వేడుకుంటున్నారు. హెల్త్ ఎమర్జెన్సీలో ఉండే అంబులెన్స్‌లకే చోటు కల్పించకపోతే ప్రాణాలు ఎలా నిలుస్తాయని పలువురు సామాజికవేత్తలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఆయా శాఖల మధ్య సమన్వయం ఏర్పరచుకొని, జఠిలమైన ట్రాఫిక్ సమస్యను సకాలంలో చక్కని పరిష్కారం చూపాలని వాహనదారులు ముక్తకంఠంతో వేడుకుంటున్నారు.

ఆటల పోటీల్లో జెడ్‌పి విద్యార్థుల సత్తా

ముసునూరు : మండల స్థాయి ఆటల పోటీలలో ప్రతిభ కనబరచిన విద్యార్థులను పల్లెగ్రముడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జె.విజయ రత్నకుమారి అభినందించారు. ఈనెల 6వ తేదీ నుంచి 10వ తేదీ వరకు నిర్వహించిన మండల స్థాయి ఆటల పోటీలలో ప్రతిభ కనబరిచి, విజయం సాధించిన విద్యార్థులు డివిజన్ స్థాయి ఆటల్లో ఆడేందుకు ఎంపికైనట్లు తెలిపారు. వీరికి తర్ఫీదు ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు బి.సుకుమార్‌ను అభినందించారు.

జాతీయ స్థాయి పోటీల్లో ఇందుప్రియ ప్రతిభ

ముసునూరు : మండలం, డివిజన్, జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో కూడా తమ విద్యార్థులు ప్రతిభ కనబరుస్తున్నారని రమణక్కపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు వాకా నాగరాజు ఆనందం వ్యక్తం చేశారు. చిత్తూరులో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాస్కెట్‌బాల్ పోటీలలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన డి.ఇందు ప్రియ డెహ్రాడూన్‌లో జరిగిన జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించిందన్నారు. అందుకుగాను మండల స్థాయిలోని నాయకులు, అధికారులు, తమ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థిని ఘనంగా అభినందించారు.

కేన్సర్‌పై 2కె అవగాహన ర్యాలీ

ఏలూరు అర్బన్ : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, మానవత, సి ఆర్ రెడ్డి కళాశాలలు, బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యాన కేన్సర్‌పై 2కె అవగాహన ర్యాలీని శుక్రవారం సి ఆర్ రెడ్డి ఫార్మసీ కళాశాల నుంచి సత్రంపాడులోని ఆదిత్య డిగ్రీ కళాశాల మీదగా నిర్వహించారు. ఈ సందర్భంగా బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ హాస్పిటల్ డాక్టర్ డి.రవిశంకర్ ప్రసాద్ మాట్లాడుతూ మారిన మానవుని జీవనశైలి, వివిధ రకాల ఆహారపు అలవాట్లు వల్ల ఆడ, మగ అనే తారతమ్యం లేకుండా కేన్సర్ బారిన పడుతున్నారని, ఎప్పుడు ఎందుకు, ఎలా వస్తుందో కూడా తెలియని పరిస్థితుల్లో ఉన్నారని అన్నారు. వందకుపైగా కేన్సర్‌లోని రకాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ కమిటీ సభ్యులు ఎ.నాగేశ్వరరావు, ఎం.చంద్రశేఖర్, ఎం.అజయ్ బాబు పాల్గొన్నారు.

సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

దెందులూరు : పేద బడుగు బలహీన తరగతులతో పాటు అన్ని తరగతుల వారికి కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ తెలిపారు. ఆపదలో ఆపన్న హస్తము అందిస్తూ దెందులూరు నియోజకవర్గంలో అనారోగ్యం, సమస్యలతో బాధపడుతున్న పలువురికి చింతమనేని చొరవతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఉదయం బాధిత కుటుంబాలకు అందజేశారు. అనంతరం పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించి, వాటిని పరిష్కరించేలా చర్యలు చేపడతామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చేవూరు గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు

లీజుదారునికి, కాలనీవాసులకు మధ్య వాగ్వివాదం

ముదినేపల్లి : చేవూరులో శుక్రవారం ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. మురుగు నీటి బోదె సమస్య జటిలంగా మారింది. నాలుగు రోజులైనా సమస్యకు అధికారులు పరిష్కారం చూపకపోవడంపై కాలనీ వాసులు లీజుదారున్ని ప్రశ్నించారు. దీంతో చెరువుల లీజుదారునికి, కాలనీవాసులకు మధ్య వాగ్వివాదాలు జరిగాయి. కాలనీవాసులు లీజుదారినితో మురుకుబోదె ఏర్పాటు చేసి చెరువులు తవ్వుకుంటామన్నారు. చెరువులు తవ్వకం పూర్తయిన తర్వాత బోదెకు ఓ రైతు అడ్డుకట్ట వేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించడంతో కాలనీవాసులకు, లీజుదారునికి మధ్య ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది . ఈ ఘర్షణ తీవ్రస్థాయికి చేరింది. అదే సమయంలో అక్కడికి చేరుకున్న మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సేవ నాగ జగన్ బాబురావు జోక్యం చేసుకుని దళితులపై దౌర్జన్యం చేయటం తగదన్నారు. తొలుత తహశీల్దార్ చేవూరులోని చెరువులను పరిశీలించి అనుమతి లేని చెరువులు ధ్వంసం చేస్తామన్నారు. రైతులంతా మాట్లాడుకుని బోధిలో వేసిన అడ్డుకట్టలు తొలగిస్తే మంచిదని. లేకుంటే ధ్వంసం చేస్తామని హెచ్చరించారు.

నేరాలు – ఘోరాలు

బంగారు ఆభరణాల చోరీపై కేసు నమోదు

టి.నరసాపురం : బంగారు ఆభరణాల చోరీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం.జయబాబు శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మక్కినవారిగూడెం గ్రామానికి చెందిన జాలా వెంకటేశ్వరరావు ఈనెల 15న భార్య పిల్లలతో కలిసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అచ్యుతాపురం గ్రామానికి వెళ్లాడు. తిరిగి ఈనెల 17న ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉండడంతో అనుమానంతో లోనికి వెళ్లి చూడగా బీరువా పగులగొట్టి గుర్తు తెలియని దొంగలు అరకాసు బంగారపు చెవిపోగు, జత వెండి పట్టీలు, రూ.5 వేల నగదు అపహరించినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

బాణసంచా సామగ్రి పట్టివేత

జీలుగుమిల్లి : ఎటువంటి లైసెన్స్ లేకుండా అనధికారికంగా కిరాణా దుకాణం లో నిల్వ ఉన్న బాణసంచా సామగ్రిను పట్టుకున్నట్లు ఎస్ఐ వి.క్రాంతి కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని దర్భగూడెం గ్రామంలోని కిరాణా దుకాణంలో ఎటువంటి లైసెన్స్ లేకుండా అనధికారికంగా బాణసంచాను నిల్వ చేసినట్లు ఫిర్యాదు మేరకు దాడులు చేయగా పలు రకాల బాణసంచా సామగ్రిను గుర్తించినట్లు తెలిపారు. బాణసంచా సామాగ్రిని స్వాధీనం చేసుకొని దుకాణా యజమాని కంచర్ల సుబ్బారావుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చిరునామా అడిగి.. గొలుసు కాజేసి

ఉంగుటూరు : నారాయణపురంలో వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును దుండగులు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన ఉంగుటూరు మండలం నారాయణపురంలో శుక్రవారం చోటుచేసుకుంది. నారాయణపురానికి చెందిన గన్నమని శ్రీలక్ష్మి స్థానిక కోదండ రామాలయం వద్ద ఓ ఇంట్లో ఒంటరిగా నివాసం ఉంటున్నారు. ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై వచ్చి ఆమెను ఓ ఇంటి చిరునామా గురించి అడిగారు. దానికి ఆమె తెలియదని చెప్పి ఇంటిలోకి వెళ్లిపోయింది. ఆమె వెనకనే ఒకరు లోపలికి వెళ్లి ఆమె మెడలోని 6 కాసుల బంగారు గొలుసును తస్కరించి ద్విచక్ర వాహనంపై పారిపోయారు.

బాణసంచా తయారీదారుడు అరెస్ట్

ఏలూరు స్పోర్ట్స్ : ఏలూరు నగరంలోని సత్రంపాడు ఎంఆర్‌సి కాలనీలో ఒక ఇంట్లో నిబంధనలకు విరుద్ధంగా తయారు చేస్తున్న బాణసంచాను శుక్రవారం ఏలూరు త్రీ టౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా పేలుడు పదార్థాలతో నార బాంబులు, తాటాకు టపాకాయలు, ఉల్లి పాయలు, మతాబులను తయారు చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

ట్రంప్ సుంకాలతో దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలు

ప్రజాశక్తి – ముసునూరు

యుటిఎఫ్ స్టడీ సర్కిల్‌లో నాయకులు

ముసునూరులో..

ట్రంపు విదేశీ వస్తువులపై విధిస్తున్న సుంకాల వల్ల భారతదేశం ఆర్థికంగా ఇబ్బందులకు లోనవుతుందని, ముఖ్యంగా ఆక్వా, ఫార్మసిటికల్, టెక్స్‌టైల్ రంగాలు భారీ నష్టాలు చవిచూసే అవకాశం ఉందని సిఐటియు నాయకులు హనుమాన్లు అన్నారు. ట్రంపు సుంకాలు భారతదేశ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం అనే అంశంపై యుటిఎఫ్ స్టడీ సర్కిల్‌ను నాలుగు మండలాల నాయకులతో, ప్రజా సంఘాల నాయకులతో శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు కాసాని గాంగేయుడు అధ్యక్షత వహించారు. యుటిఎఫ్ మండల అధ్యక్షులు జి.పద్మ కిషోర్ మాట్లాడుతూ ప్రపంచీకరణలో అమెరికా ఒక్కటే మార్కెట్ కాదని, ప్రత్యామ్నాయ మార్కెట్లు చూడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వం మీద ఉందని పేర్కొన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాజు మాట్లాడుతూ ట్రంపు విధించిన సుంకాల వల్ల సినిమా రంగంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని వ్యాఖ్యానించారు. అనంతరం బత్తుల అనురాధ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు బాబురావు, ప్రధాన కార్యదర్శి అజరయ్య, నాయకులు గుడిమెళ్ల రాంబాబు, శోభనాద్రి, జాకోబ్ రాజ్, బాల కోటేశ్వరరావు, సత్యానంద్ పాల్గొన్నారు.

కలిదిండి : ట్రంప్ సుంకాలు భారతదేశంపై ప్రభావం అనే అంశంపై యుటిఎఫ్ ఆధ్వర్యాన కలిదిండిలో స్టడీ సర్కిల్ నిర్వహించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాలు, అదనపు సుంకాల పేరుతో ప్రపంచదేశాలపై ఆర్థిక దాడి చేస్తున్నారని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి దుర్గాప్రసాద్ అన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పివి.సాగర్ బాబు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి.ప్రసన్న కుమారి, సిహెచ్.స్వర్ణ రేఖ, మండల గౌరవాధ్యక్షులు ఎ.రాజమోహన్, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్.సౌభాగ్య లక్ష్మి, కె.సురేష్ పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛను కాపాడాలి

జర్నలిస్టు, ప్రజా సంఘాల ఆధ్వర్యాన

నిరసన – జెసికి వినతి

ఏలూరు అర్బన్ : రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 1(ఎ) ప్రకారం కల్పించిన భావప్రకటన స్వేచ్ఛను రాష్ట్రంలోని కూటమి పాలకులు హరిస్తున్నారంటూ పలువురు వక్తలు మండిపడ్డారు. సాక్షిపై కూటమి ప్రభుత్వం కుట్రలను నిరశిస్తూ జర్నలిస్టు సంఘాలు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల ఆధ్వర్యాన శుక్రవారం ఏలూరు కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా పత్రికా స్వేచ్ఛను కాపాడాలంటూ, మీడియాపై దాడులను అరికట్టాలని, జర్నలిస్టులపై వేధింపులను ఆపాలని, సిగ్గు.. సిగ్గు పత్రికలపై దాడులు అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మామిళ్లపల్లి జయప్రకాష్(జెపి), సిపిఎం నగర కార్యదర్శి పంపన రవికుమార్, నాయకులు ఎం.ఇస్సాక్, జె.గోపి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, జర్నలిస్టు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు మొక్కను అందజేస్తున్న ఎన్‌జిఒ నేతలు

జెసి అభిషేక్ గౌడను కలిసిన ఎన్‌జిఒ నేతలు

ప్రజాశక్తి – ఏలూరు అర్బన్

ఇటీవల ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న అభిషేక్ గౌడను శుక్రవారం ఏలూరు కలెక్టరేట్లో ఎపి ఎన్‌జిఒస్ అసోసియేషన్ నాయకులు కలిసి శాలువాతో సత్కరించి, పూల మొక్కని ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జెసి అభిషేక్ మాట్లాడుతూ జిల్లా సమగ్ర అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఎన్‌జిఒస్ సంఘ నాయకులని కోరారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఎపి ఎన్‌జిఒస్ అసోసియేషన్ అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్ స్పందిస్తూ ప్రభుత్వ పథకాల అమలులో ఉద్యోగులంతా అధికారులకు తగిన సహకారం అందిస్తామని తెలిపారు. అసోసియేషన్ కార్యదర్శి నెరుసు వెంకట రామారావు, జిల్లా, తాలుకా ఎన్‌జిఒస్ అసోసియేషన్ నాయకులు, మహిళా విభాగం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

జెసిను రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్ర రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు మిరియాల లక్ష్మీనారాయణ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రవీంద్ర రాజు మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పనిచేస్తున్న గ్రేడ్ 1 విఆర్ఒలకు సీనియర్ అసిస్టెంట్‌లుగా వెంటనే ప్రమోషన్లు కల్పించాలని అన్నారు. సంఘం జిల్లా అధ్యక్షులు కాయల వెంకటేశ్వరరావు, జిల్లా కోశాధికారి రవికుమార్, పెదవేగి మండల విఆర్ఒ సంఘం నాయకులు శ్రీనివాస్, ఝాన్సీ పాల్గొన్నారు.

నూతన ఉపాధ్యాయులకు సర్వీస్ బుక్ అందజేత

ముసునూరు : మండలంలో డిఎస్‌సి–2025 ద్వారా నూతనంగా ఉద్యోగంలోకి జాయిన్ అయినటువంటి ఉపాధ్యాయులను యుటిఎఫ్ మండల శాఖ తరపున సర్వీస్ బుక్కును వారికి ఉచితంగా అందజేశారు. అదేవిధంగా యుటిఎఫ్ సంఘంలోకి సభ్యత్వ నమోదు కూడా చేయించారు. ఉపాధ్యాయ విద్యలో జీవితం మొత్తం ఉపయోగపడే సర్వీస్ రిజిస్టర్ యుటిఎఫ్ అందించటం చాలా ఆనందంగా ఉందని నూతన ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు కాసాని గాంగేయుడు, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి.పద్మ కిషోర్, గుడిమళ్ల రాంబాబు, సహాధ్యక్షులు పుల్లయ్య, కోశాధికారి నారాయణ, విష్ణువర్ధన్, తదితర నాయకులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం : ఎంఎల్‌ఎ

ఏలూరు సిటీ : ఆపదలో ఉన్న పార్టీ కార్యకర్తలకు కొండంత ధైర్యాన్నివ్వడమే తక్షణ కర్తవ్యంగా టిడిపి తొలి నుండి ఆచరిస్తూ వస్తోందని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి అన్నారు. పార్టీ సభ్యత్వాలతో కలిగే మేలు ఎంతో గొప్పదని ఆయన పేర్కొన్నారు. ఎంఎల్‌ఎ బడేటి చంటి శుక్రవారం ఏలూరులోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉన్నారు. అనంతరం ఆయా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ఇదే సమయంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన స్థానిక 39వ డివిజన్‌కు చెందిన టిడిపి కార్యకర్త మిండల చిన్నయ్య కుటుంబ సభ్యులు ఎంఎల్‌ఎ బడేటి చంటిని కలుసుకున్నారు. టిడిపి ప్రాథమిక సభ్యత్వం కలిగిన చిన్నయ్య మృతిచెందడంతో ఆయన భార్య మిండల వెంకటేశ్వరమ్మ బ్యాంక్ ఖాతాకు ప్రమాద బీమా కింద రూ.5 లక్షలు జమ కావడంతో ఆమె ఎంఎల్‌ఎ చంటిని కలిసి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈక్రమంలో వారికి ధైర్యం చెప్పిన ఎంఎల్‌ఎ చంటి సొంతింటిని కూడా కట్టించేందుకు కృషిచేస్తానని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బెల్లపుకొండ కిషోర్, డివిజన్ ఇన్‌ఛార్జి పలివేల లవ కిషోర్, ఈడా ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్ పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి మంత్రి సాయం

ముసునూరు : మండలంలోని కాట్రేనిపాడు గ్రామానికి చెందిన కె.పోతురాజునకు చెందిన ఇంట్లో గ్యాస్ బండలు లీకై ఇల్లు కాలిపోగా ఆవిషయం తెలుసుకొని రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి స్వయంగా ఫోన్ చేసి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, సాయం అందజేశారు. తమ సొంత నగదు రూ.5 వేలు, టిడిపి నాయకులు రూ.10 వేలు, మొత్తం కలిపి రూ.15 వేలు నగదు టిడిపి మండల అధ్యక్షులు గద్దె రఘుబాబు, టిడిపి నాయకులు, కార్యకర్తలు కలిసి పరామర్శించి అందజేశారు. వారి కుటుంబానికి అండగా ఉంటానని, కూటమి ప్రభుత్వం తరుపున వచ్చే పలు సంక్షేమాభివృద్ధి పథకాలు అందిస్తామని మంత్రి అన్నారు. తక్షణ చర్యల్లో భాగంగా బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు అందజేయాలని అధికారులకు ఆదేశించి, కుటుంబానికి పక్కా ఇల్లు నిర్మించాలని అధికారులకు తెలిపారు. వీరి ఇరువురు పిల్లల స్టడీ సర్టిఫికెట్స్ ప్రమాదంలో కాలి బూడిదవ్వడంతో, వారి సర్టిఫికెట్స్, ఇతర పత్రాలు కూడా త్వరలో ఇప్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బొమ్మ కంటి శ్యామలరావు, రాపర్ల ప్రతాప్, సూర్యదేవర శ్రీనివాసరావు, రాపర్ల బాలకృష్ణ, బి.సాంబయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రైస్తవులపై దాడులు అరికట్టాలి

ఎఐసిసి అధ్యక్షులు జాన్ బెన్నీ లింగం

ముదినేపల్లి : క్రైస్తవులపై జరుగుతున్న దాడులను ప్రభుత్వం వెంటనే అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని క్రిస్టియన్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షులు జాన్ బెన్నీ లింగం కోరారు. ముదినేపల్లిలో క్రిస్టియన్ ఐక్యవేదిక ఆధ్వర్యంలో జీసస్ క్రైస్ట్ ప్రేయర్ హాల్లో దైవ సేవకులకు మేలుకొలుపు సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా జాన్ బెన్నీ మాట్లాడుతూ క్రైస్తవులందరూ ఐక్యంగా ఉండాలన్నారు. గ్రామాల్లో సేవ చేస్తున్న పాస్టర్లను చిన్నచూపు చూస్తూ బడా బాబులు అవమానకరంగా ప్రవర్తించడం శోచనీయమన్నారు. కార్పొరేట్ పాస్టర్లు డబ్బులకు పరిమితమై వారిని పట్టించుకోవడం లేదన్నారు. దైవ సేవకులకు రావలసిన 13 నెలల గౌరవ వేతనాన్ని ప్రభుత్వం విడుదల చేయాలన్నారు. ఉపాధ్యక్షులు యేవేలు రాజు, కోఆర్డినేటర్ సతీష్ కుమార్ పాల్గొన్నారు.

జిఎస్‌టి తగ్గింపు బూటకం

అబద్ధాలతో టిడిపి ప్రచారం

సిపిఎం నేత రమణారావు

నిడమర్రు : జిఎస్‌టి తగ్గింపు పేరుతో అబద్దాలతో ప్రచారం చేస్తూ టిడిపి కూటమి ప్రభుత్వం ప్రజలను మోసగిస్తుందని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నారపల్లి రమణారావు అన్నారు. అభివృద్ధి పేరుతో ప్రజలని మోసం చేస్తూ.. జిఎస్‌టి తగ్గించామని గొప్పలు చెప్పుకుంటూ ప్రభుత్వం ఖర్చుతో గ్రామాలలో ప్రచార సభలు నిర్వహించుకుంటూ కాలం గడుపుకుంటున్నారని ఆయన ఎద్దేవా చేశారు. శుక్రవారం. నిడమర్రు ప్రజాసంఘాల కార్యాలయంలో సిపిఎం మండల కమిటీ సమావేశం గవర సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో రమణారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జిఎస్‌టి తగ్గించి కుటుంబానికి రూ.లక్ష 80 వేలు భరోసా కల్పిస్తున్నామని ప్రచారం చేసుకుంటున్నారన్నారు. గడిచిన గత ఏడేళ్ల కాలంలో ప్రతి కుటుంబం నుంచి సంవత్సరానికి రూ.లక్షా 80 వేలు దోపిడీ చేశారనే విషయాన్ని చెప్పడం లేదన్నారు. మోడీ అధికారంలోకి వచ్చిన నాటికి రూ.400 ఉన్న గ్యాస్ బండ నేడు రూ.1100లకు చేరిందని, పెట్రోల్, డీజిల్ ధరలు రూ.60 నుండి 110కు, ఇతర నిత్యాసర వస్తువుల ధరలు, విద్యుత్తు ఛార్జీలు పెంచారని, ప్రజలను నిలువునా దోచేస్తున్నా రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు వ్యతిరేకించకపోగా మద్దతునిచ్చారని మండిపడ్డారు. దీనిని అందరూ తిప్పికొట్టాలని తెలిపారు. ఈ సమావేశంలో వెలగలేటి మోహన, కంచ వరప్రసాద్, లావేటి సోంబాబు, కానూరు రాజు, కమిలి నాని తదితరులు పాల్గొని మాట్లాడారు.

కళాశాలలో అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవం

చింతలపూడి : కుటుంబాలకు గౌరవం, సమర్థవంతమైన మద్దతును నిర్ధారించటం ద్వారా సామాజిక సంస్థాగత దుష్ప్రవర్తనను అంతం చేయడమే అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యమని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాసరావు వివరించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల చింతలపూడిలో శుక్రవారం ఆర్థిక శాఖ, చరిత్ర విభాగం ఆధ్వర్యాన అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాసరావు, ఆర్థిక శాఖాధిపతి డి.శంకర పోలయ్య మాట్లాడుతూ 2024 సంవత్సరం చివరినాటికి ప్రపంచ జనాభాలో 670 మిలియన్ల మంది పేదరికంతో బాధపడుతున్నారని, ప్రపంచంలో ఆకలి పేదరికం, హింస, ఆత్మహత్యలకు ప్రధాన కారణమని వివరించారు. అనంతరం చరిత్ర శాఖాధిపతి డాక్టర్ ఎ.సంతోష్ రావు మాట్లాడుతూ దారిద్ర్యరేఖకు కింద ఉన్న వాళ్లకు సరైన ఆహారం, వైద్యం అందకపోవడం, పేదరికంలో ఉన్న వాళ్లకు సరియైన సహాయ సహకారాలు అందకపోవడం, విద్యాభ్యాసం పట్ల అవగాహన రాహిత్యం వల్ల చదువుకు దూరంగా ఉండటం, సరైన ఆహారం అందకపోవడం వల్ల పేదరికంలో మగ్గుతున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు శాఖాధిపతి డాక్టర్ జి.శ్రీనివాస్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ అంజాద్ ఆలీ, వృక్షశాస్త్ర అధ్యాపకురాలు టి.మహాలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.

త్రీఫేజ్ కరెంటు ఏర్పాటు : ఎఇ

నూజివీడు టౌన్ : ఎన్నో ఏళ్లుగా 24 గంటలు త్రీఫేజ్ కరెంటు లేకపోవడంతో రాట్నాలగూడెం కాలనీలో మంచినీటి సమస్యతో ఎన్నో విధాలుగా బాధలు పడుతున్నారు. మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశాల మేరకు విద్యుత్ శాఖ వారు ఆర్‌డిఎస్ఎస్ స్కీము ద్వారా 24 గంటల త్రీఫేజ్ కరెంటును పది రోజుల్లో పూర్తి చేసి కరెంటు ఇవ్వడం జరిగింది. దీనికి సుమారుగా రూ.35 లక్షల ఖర్చు అయిందని స్థానిక మీర్జాపురం విద్యుత్ ఎఇ తెలిపారు.

అన్ని మద్యం షాపుల్లోనూ ఎక్సైజ్ సురక్ష మొబైల్ యాప్

అమ్మకాలు పూర్తిగా స్కాన్ విధానంలోనే..

ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎ.మస్తానయ్య

నూజివీడు టౌన్ : నూజివీడు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని అన్ని మద్యం షాపులలో 'ఎక్సైజ్ సురక్ష' మొబైల్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేయించి, అమ్మకాలు పూర్తిగా స్కాన్ విధానంలోనే నిర్వహించేలా చర్యలు తీసుకున్నట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎ.మస్తానయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మద్యం సీసాపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా మద్యం నాణ్యత, తయారీ వివరాలు, లైసెన్సు స్థితి గురించి వినియోగదారులు సులభంగా తెలుసుకోవచ్చని తెలిపారు. ఇది నకిలీ మద్యం విక్రయాలను అరికట్టడమే కాకుండా పారదర్శకతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆయన పేర్కొన్నారు. అలాగే ఎక్సైజ్ సిబ్బందిని మద్యం షాపుల వద్ద యాప్ వినియోగాన్ని నిరంతరం పర్యవేక్షిస్తున్నారని, అమలు చేయని షాపులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వినియోగదారులు నకిలీ మద్యం కనిపించినప్పుడు టోల్ ఫ్రీ నంబర్ 14405 లేదా 9440902462కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

బాలికల రక్షణకు ప్రభుత్వం కృషి : కలెక్టర్

ఏలూరు స్పోర్ట్స్ : బాలికలకు నిరంతరం అభయాన్ని ఇవ్వడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి అంతర్జాతీయ బాలికల దినోత్సవ కార్యక్రమంలో అన్నారు. ఏలూరు నగరంలోని గౌరవరంలో ఉన్న సెయింట్ ఆన్స్ కళాశాలలో అంతర్జాతీయ బాలికల దినోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జిల్లా పరిషత్తు ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేము సైతం అనే ఫ్లెక్సీ బోర్డుపై జిల్లా కలెక్టర్ సంతకం చేశారు. మీ రక్షణ – మా కర్తవ్యం శక్తి యాప్‌ను ఆవిష్కరించి, ప్రతి మహిళ, ప్రతి బాలిక శక్తి యాప్‌ను డౌన్లోడ్ చేసుకోవాలని కోరారు. ఆర్‌డిఒ ఎం.అచ్యుత అంబరీష్, ఐసిడిఎస్ ఆర్‌జెడి బి.సుజాతారాణి, పిడి ఎ.శారద, జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పిజె.అమృతం, జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ, జిల్లా శిశుసంరక్షణ అధికారి డాక్టర్ సిహెచ్.సూర్యచక్రవేణి పాల్గొన్నారు.

జిఎస్‌టి 2.0 అమలుతో ధరలు తగ్గింపు : ఎంపిడిఒ

భీమడోలు : జిఎస్‌టి 2.0 అమలు ద్వారా ధరలు తగ్గుతాయని, కొనుగోలు శక్తి పెరుగుతుందని భీమడోలు మండల పరిషత్ అభివృద్ధి అధికారి పద్మావతి దేవి తెలిపారు. భీమడోలులోని వివిధ ప్రాంతాలలో శుక్రవారం ఆటోమొబైల్, క్రీడా పరికరాలు, వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిఎస్‌టి అవగాహన కార్యక్రమాలలో ఆమె పాల్గొన్నారు. భీమడోలు సంత పేటలో ఆటోమొబైల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ తగ్గిన జిఎస్‌టి వల్ల రవాణా రంగం, రవాణా వాహనాలపైన భారం తగ్గుతుందని తెలిపారు. అనంతరం ఆటో యూనియన్ ఆధ్వర్యాన నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. మండల విద్యాధికారి శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ శేషగిరి, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు కరణం పెద్దిరాజు పాల్గొన్నారు.

టి.నరసాపురం : జిఎస్‌టి తగ్గింపుతో అన్ని తరగతుల ప్రజలకు మేలు జరుగుతుందని ఎంపిడిఒ జి.మణి కుమారి అన్నారు. సూపర్ జిఎస్‌టి–సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా ఎంపిడిఒ మణి కుమారి ఆధ్వర్యాన స్థానిక ఎంపిడిఒ కార్యాలయం నుండి అంబేద్కర్ సెంటర్ వరకు శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎపిఒ నాగేశ్వరరావు, పి.శేఖర్ బాబు, రఘు రాముడు పాల్గొన్నారు.

పాఠశాలకు ఆట వస్తువుల కొనుగోలు

పోలవరం : గూటాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పిఎంశ్రీ నిధుల ద్వారా సుమారు రూ.15 వేలతో విలువైన ఆట వస్తువులను కొనుగోలు చేసి పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు జె.చంద్రశేఖర్ ఆధ్వర్యాన వ్యాయామ ఉపాధ్యాయుడు కిషోర్‌కు శుక్రవారం అందజేశారు. బొరుసు బాలాజీ, కె.రాజరాజేశ్వరి, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

దస్తావేజులు పోయినవి

ఏలూరు జిల్లా, పెదవేగి మండలం, రాయన్నపాలెం గ్రామానికి చెందిన పామర్తి రాధాకృష్ణ, తండ్రి: ఏడుకొండలు అను నేను నా పొలానికి సంబంధించిన దస్తావేజులు తీసుకొని జిరాక్స్ తీయించడానికి రాయన్నపాలెం గ్రామం నుంచి విజయరాయి గ్రామానికి సైకిల్‌పై వెళుతుండగా మార్గమధ్యంలో పొలం దస్తావేజు పత్రాలు పడిపోయాయి. నేను విజయరాయి వెళ్లి చూసుకోగా దస్తావేజు పత్రాలు కనిపించలేదు. వెనక్కి వెళ్లి దారిలో చూసినప్పటికీ అవి కనిపించలేదు. ఎవరికైనా దస్తావేజులు దొరికినట్లైతే తెలియపరచవలసిందిగా కోరుచున్నాను. దస్తావేజు నంబర్లు ఖాతా నెంబర్ : 729, సర్వే నంబర్ : 287/1 విస్తీర్ణం :1.01 ఎకరాలు

పామర్తి రాధకృష్ణ
తండ్రి: ఏడుకొండలు
రాయన్నపాలెం, పెదవేగి మండలం
సెల్ నెం: 94418 29934

మహారాజశ్రీ కృష్ణాజిల్లా మచిలీపట్నం 9వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
I. P. No. 23/2024

Between :
అందె నెహ్రూ ......పిటీషనర్
మరియు
చెనమళ్ళ చంద్ర శేఖర్ వగైరా .... రెస్పాండెంట్స్
To,
రెస్పాండెంట్ 18 : గొర్లె లక్ష్మణరావు S/o. వెంకన్న, R/o. మూలలంక, కలిదిండి మండలం, ఏలూరు జిల్లా.

పై నెంబర్ I.P. లో 18వ రెస్పాండెంట్ అయిన మీకు నోటీసు అమలు నిమిత్తం ది. 11-11-2025 నకు వాయిదా అయి యున్నది. కావున సదరు వాయిదా రోజున ఉదయం గం. 10.30 ని. లకు మీరు స్వయంగా గానీ లేదా న్యాయవాది ద్వారా గానీ పై కోర్టు వారి యెదుట హాజరై మీకుగల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనియెడల మీ పరోక్షమున తదుపరి గ్రంథములు జరిపించబడునని ఇందు మూలంగా తెలియజేయటమైనది.

(శ్రీకోర్టువారి ఉత్తర్వులప్రకారం)
వాయిదా తేది :11-11-2025
జి.వి.ఎల్.నరసింహారావు
పిటీషనర్ తరఫున న్యాయవాది, మచిలీపట్నం.

మహారాజశ్రీ కృష్ణాజిల్లా మచిలీపట్నం 9వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
I. P. No. 23/2024

Between :
అందె నెహ్రూ ......పిటీషనర్
మరియు
చెనమళ్ళ చంద్ర శేఖర్ వగైరా .... రెస్పాండెంట్స్
To,
రెస్పాండెంట్ 2 : పసుపులేటి చంద్రశేఖర్ S/o. సోమయ్య, R/o. రామలక్ష్మణ నగర్ రోడ్, D.No. 25-9-245/6-2, భీమవరం, పశ్చిమగోదావరిజిల్లా.

పై నెంబర్ I.P. లో 2వ రెస్పాండెంట్ అయిన మీకు నోటీసు అమలు నిమిత్తం ది. 11-11-2025 నకు వాయిదా అయి యున్నది. కావున సదరు వాయిదా రోజున ఉదయం గం. 10.30 ని. లకు మీరు స్వయంగా గానీ లేదా న్యాయవాది ద్వారా గానీ పై కోర్టు వారి యెదుట హాజరై మీకుగల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనియెడల మీ పరోక్షమున తదుపరి గ్రంథములు జరిపించబడునని ఇందు మూలంగా తెలియజేయటమైనది.

(శ్రీకోర్టువారి ఉత్తర్వులప్రకారం)
వాయిదా తేది :11-11-2025
జి.వి.ఎల్.నరసింహారావు
పిటీషనర్ తరఫున న్యాయవాది, మచిలీపట్నం.

S.R.K.R. ENGINEERING COLLEGE (AUTONOMOUS)
Accredited by AICTE, New Delhi and Affiliated to JNTUK, Kakinada,
NAAC with A+ Grade, CHINNA AMIRAM (PO) :: BHIMAVARAM, W.G.Dt.
☎ 98488 23332

ADMISSION NOTIFICATION FOR CATEGORY 'B' (NON-NRI QUOTA)

Applications are invited for admission into B.Tech. under Category-B (Non-NRI Quota) for the academic year 2025-26. Candidates seeking admission may apply directly into the portal https://cets.apsche.ap.gov.in from 19-10-25 to 23-10-25 or apply directly to the institution in person.
For courses available & other details visit our website www.srkrec.ac.in. Eligibility of the candidates, Application registration fee is as prescribed by APSCHE. *Principal*

దస్తావేజులు పోయినవి

ఏలూరు జిల్లా, ముసునూరు మండలం, కాట్రేనిపాడు గ్రామానికి చెందిన దేవరపల్లి సురేష్, తండ్రి: వెంకటేశు అనే వెంకటేశ్వరరావు అను నేను నా పొలం **దస్తావేజులు నెం: 1364/2017** దస్తావేజులు తీసుకొని జిరాక్స్ నిమిత్తం కాట్రేనిపాడు నుండి ముసునూరు వెళ్ళివస్తుండగా, మార్గమధ్యంలో జారి పడిపోయాయి. ఎంత వెతికినా దొరకలేదు. కావున ఎవరికైనా దొరికిన యడల ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

దేవరపల్లి సురేష్
తండ్రి: వెంకటేశ్వరరావు
కాట్రేనిపాడు, ముసునూరు మండలం
సెల్ నెం: 90100 88189

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (JUNIOR DIVISON) AT PALAKOL
E.P.No. 01/2025 in O.S.No. 51/2018
Between:
పైల శ్రీహరిబాబు ...Decree Holder
Vs
శృంగవృక్షం నాగ వెంకట సాయి
...Judgment Debtor

పై నెంబరు EP గ్రంథంలో సదరు డిక్రీ హోల్డర్, జడ్జిమెంట్ డెబిటర్‌కు ఎన్ని పర్యాయములు సదరు కోర్టు ద్వారా నోటీసులు పంపియున్నను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. సదరు జడ్జిమెంట్ డెబిటర్ అయిన శృంగవృక్షం నాగ వెంకట సాయి W/o. (లేట్) చిన్న స్వామి, డోర్ నెంబర్: 11-6-49, 4th వార్డ్, పల్లపు వీధి, పాలకొల్లు, పాలకొల్లు మండలం, ప॥గో॥జిల్లా అను Substitute Service పేపరు పబ్లికేషన్ ద్వారా నోటీసు అమలు జరుపుటకు సదరు కోర్టు వారు ఆర్డరు వేసియున్నారు. సదరు EP గ్రంథములో మీకేమైనా ఆక్షేపణలున్న యెడల **ది. 23-10-2025 వ తేదీన ఉదయం గం. 10-30 ని॥లకు** పై కోర్టులో హాజరయి ఆక్షేపణలు తెలుపవలెను.

పెంకి పూర్ణ రవి చంద్ర (P.P.R.C)
బి.యస్సీ., బి.ఎల్., ఎల్.ఎల్.ఎం., పీజీ.డి.సి.ఏ
పాలకొల్లు న్యాయవాది, పాలకొల్లు
ది. 17-10-2025 సెల్: 98668 47144

IN THE COURT OF 1 st ADDITIONAL DISTRICT JUDGE ELURU
E.P.NO.95/2024 in O.S.NO.3/2016
Between:
Alla Venkata Narasimha Rao
...Decree-Holder
And
Prasadapu Venkateswara Rao
And others **...Judgement-Debtors**

AUCTION PUBLIATION

WHERE AS the DHR obtairned decree gainst the JDRs above named and the property of JDRs brought the below mentioned EP schedule property to sale in the above Execution petition.

WHERE AS the Honourable 1 st ADDITIONAL DISTRICT JUDGE COURT, ELURU fixed the date on 07-11-2025 for the sale of the schedule property by public auction in the court, by ordering publication of the sale for notice to the intending bidders in order to participate in the auction.

TAKE NOTICE that the persons who intended to participate in the auction for purchase of the schedule mentioned property can appear before the Honurable ourt on 07-11-2025 at 10-30 A.M on words and participate in auction.

SCHEDULE

Item No.1:
West Godavari District, Presently Eluru Dt, Eluru Sub-Registry. Eluru City an extent of Ax. 219-4-0 Square yards of site equal to 183-447 Sq.mts. situated in R.S.Nos. 77/4, 77/5 equal to T.S.Nos. 77/4,77/5 of Phiranguladibba, Muncipal 1/WP ward, Santhinagar, 9 Road, Eluru which is bounded by as follows:
East : Item No.2 joint passage site 50Ft
South : Site of Chinni Lakshni Talasi 39Ft
West : Property in S.No.77/1 50 Ft
North : Property in S.No.77/3 40 Ft
Within the said boundaries middle of an extent of Ac.219-4-0 Square yards of Vacant site.

Item No.2:
Joint passage site on the eastern side of item No. I an extent of 111-1-0 sq. yards situated in R.S.No.77/4,77/5 equal to T.S.Nos.77/4, 77/5 of Phiranguladibba, Santhi Nagar, 9 th Road, Eluru which is bounded by as follows:
East : M.Koteswara Rao, Sit to some Extent, K.M. Raghunadh and others site to some extent 100 Ft
South : Municipal Road 10Ft
West : Item No, 1 to some extent Ch. Lakshmi Tulasi to some extent 100ft
North : Site in R.S.No.77 /3 10Ft

D.H.R. VALUE Rs. 30,00,000/-
Amine Value Rs. 49,50,000/-
(As per court orders)

DEVULAPALLI SREE RAM
DEVULAPALLI KRISHNA SASTRY
Dt.13-10-2025. Advocates, Eluru